క్లుప్తంగా

ఘనంగా రామాలయ విగ్రహ ప్రతిష్ఠ



గోగన్నమఠం రామాలయం విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

మామిడికుదురు: తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీవాణి ట్రస్ట్ ఆర్థిక సహాయంతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోగన్నమఠం గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన శ్రీలక్ష్మణ హనుమ సీత సమేత శ్రీసీతారామ స్వామి వారి ఆలయ విగ్రహ శిఖర ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా జరిగింది. బుధవారం ఉదయం 11.19 శుభ ముహూర్తంలో యాలంగి కృష్ణ–ఈశ్వరి దంపతుల చేతుల మీదుగా వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ ఈ కార్యక్రమం ఆద్యంతం కనులపండువలా నిర్వహించారు. పలువురు భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు.

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళాలు



దాతలకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన భవన నిర్మాణానికి ఆలమూరు మండలం చెముడులంకకు చెందిన ఎస్.సుబ్బారాయుడు రూ.10,116, పోడూరుకు చెందిన కె.మణికంఠ రూ.10,116, హైదరాబాద్‌కు చెందిన ఎస్.వెంకటరమణ–చంద్రిక దంపతులు రూ.10,116 విరాళం అందించినట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. దాతలకు ఆలయ సిబ్బంది చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందజేశారు.

ఉచిత ఇన్సూరెన్స్‌పై అవగాహన కార్యక్రమం



ఉచిత ఇన్సూరెన్స్ నమోదు దరఖాస్తులు ఇస్తున్న మోహన్

సఖినేటిపల్లి: మండలంలోని వీవీ మెరకలో బుధవారం వైఎస్సార్ సీపీ గ్రామ సచివాలయ కన్వీనర్లకు, గృహసారథులకు ఉచిత ఇన్సూరెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు సూచనలతో జగనన్న కన్వీనర్ల సారథి (జేసీఎస్)మండల ఇన్‌చార్జ్ నల్లి మోహన్ ఆధ్వర్యాన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆయనకు, పలువురు గృహసారథులకు, సచివాలయ కన్వీనర్లకు ఉచిత ఇన్సూరెన్స్ నమోదు దరఖాస్తులను పంపిణీ చేశారు. తాడి సహదేవ్, ఇంజేటి విజయకుమార్, ఉప్పు సోమరాజు, పలువురు కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

మామిడికుదురు: పి.గన్నవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, మినీ అంగన్‌వాడీ కార్యకర్త, హెల్పర్ పోస్టుల భర్తీకి ఐసీడీఎస్ సీడీపీఓ వై.విజయశ్రీ నోటిఫికేషన్ జారీ చేశారు. మామిడికుదురు మండలం బి.దొడ్డవరం మెయిన్‌లో కార్యకర్త (ఓసీ జనరల్), నగరం బొంతు వారి పేటలో మినీ అంగన్‌వాడీ కార్యకర్త (ఓసీ జనరల్), మామిడికుదురు ఎస్సీ కాలనీ–2లో హెల్పర్ (ఎస్సీ), మామిడికుదురులో హెల్పర్ (బీసీ–బీ) పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. 21 నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు కలిగిన అభ్యర్థులు ఈ నెల 16వ తేదీలోగా పి.గన్నవరం ప్రాజెక్టు కార్యాలయంలో తమ దరఖాస్తులను అందించాలన్నారు.

అప్పనపల్లిలో ఉచిత సామూహిక వ్రతాలు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఏర్పాటు చేశామని ఆలయ ఈఓ జి.మాధవి, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ బుధవారం తెలిపారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం 9 గంటలకు సామూహిక వ్రతాలు ప్రారంభమవుతాయని చెప్పారు. వ్రతాలు ఆచరించే ముత్తైదువులకు పూజా సామగ్రి ఉచితంగా అందిస్తామన్నారు. ఈ పూజలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పి.గన్నవరంలో భారీ వర్షం

పి.గన్నవరం: మండల కేంద్రమైన పి.గన్నవరంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాలు, రోడ్లు జలమయం అయ్యాయి. ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. బుధవారం రాత్రి వివాహ ముహూర్తాలు ఉండటంతో ఆయా కుటుంబాల వారు, బంధువులు ఇబ్బందులకు గురయ్యారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో అనర్థం

- పెరిగిపోతున్న వినియోగం
- పేరుకుపోతున్న చెత్త

అంబాజీపేట: బయటకు వెళితే కాళ్లు కడుక్కొని ఇంట్లోకి వచ్చే మనం కాలుష్యాన్ని మాత్రం స్వయంగా ఇంట్లోకి కొనుక్కొని మరీ తెచ్చేసుకొంటున్నాం. చిన్నపాటి అశ్రద్ధ కారణంగా ప్రతిరోజూ పదుల సంఖ్యలో క్యారీ బ్యాగులు వాడుతూ అటు పర్యావరణానికి, అంతిమంగా మానవ ఆరోగ్యానికి ముప్పు తెచ్చుకొంటున్నాం. గుడ్డతో తయారు చేసిన చేతి సంచిని వినియోగిస్తే ఒక కుటుంబం రోజుకు పదికి పైగా ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వాడకాన్ని తగ్గించవచ్చు. కానీ ఆ దిశగా ఎవరూ ఆలోచించడం లేదు. దీంతో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వ్యర్థాలు కలసి ఇవన్నీ గ్రామాల మధ్య, శివార్లకు డంపింగ్ యార్డులకు చేరుతున్నాయి. కొండల్లా పేరుకొంటున్న వీటిని వదిలించే క్రమంలో నిప్పు పెడుతున్నారు. దీంతో ఇంకా వాతావరణం వేడెక్కి కాలుష్యం మరింత పెరిగి చివరికి మన ఆరోగ్యానికి మనమే ముప్పు తెచ్చుకొంటున్నాం. ప్లాస్టిక్ నిషేధంపై ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు తీసుకొంటున్నప్పటికీ అమలు చేయాల్సిన యంత్రాంగం మాత్రం నిర్లక్ష్యం చూపుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్లాస్టిక్ నిషేధం గ్రామాల్లో పూర్తి స్థాయిలో చేరకపోవడంతో పెద్ద ఎత్తున వినియోగం పెరిగిపోతోంది. మండల, గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. బాగా పెరిగాక వాటిని తగలబెడుతున్నారు. పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల్లో ఉన్న మండలాల్లోని గ్రామాల నుంచి నిత్యం సుమారు 60 టన్నుల వరకు చెత్త పోగవుతుందని ఒక అంచనా ఉందని అధికారులు చెబుతున్నారు. ఇందులో సుమారు 9 టన్నుల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నాయి. తడి పొడి చెత్త విషయంలో అలసత్వం వహిస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తిరిగి ఉపయోగించుకోవాలన్న ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు.



అంబాజీపేటలో రోడ్డు పక్కనే పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

ప్లాస్టిక్‌ను తగులబెడితే ప్రమాదమే..

ప్లాస్టిక్ కాలిస్తే మరింత ప్రమాదమని హెచ్చరిస్తున్నప్పటికీ అన్ని రకాల చెత్తతో పాటే ప్లాస్టిక్‌ను కూడా తగులబెడుతున్నారు. ఈ ప్రక్రియతో విపరీతమైన వాయుకాలుష్యం ఏర్పడుతోంది. శ్వాస సంబంధ వ్యాధులతో ఇబ్బందులు పడే వారి సంఖ్య పెరగడానికి ప్రధాన కారణాల్లో ముఖ్యమైంది ప్లాస్టిక్‌ను మండించడమే అని వైద్యులు కూడా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంపై ఎవరికి వారు అవగాహన పెంచుకోవాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. ప్లాస్టిక్ తగలబెట్టకుండా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టాలే.. నాయకులు చొరవ చూపాలని కోరుతున్నారు.

ప్లాస్టిక్ వినియోగం ప్రమాదకరం



ప్లాస్టిక్ వినియోగం మానవాళితో పాటు జీవాలకూ ప్రమాదరమే. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి. జూట్, గుడ్డ సంచులతో సమస్యలు రావని గమనించాలి. క్యారీబ్యాగ్ వినియోగించడం వల్ల తరచూ రోగాల బారిన పడే అవకాశాలు ఉన్నాయి.

– వి.గౌతమి, పీహెచ్‌సీ వైద్యాధికారి, అంబాజీపేట

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

అంబాజీపేట: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యంగా పాలన చేస్తున్నారని సర్పంచ్ కోట బేబీ రాణి, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు అన్నారు. చిరతపూడిలో నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు బుధవారం అందజేశారు. వారు మాట్లాడుతూ అర్హత కలిగి ఉంటే పింఛను వస్తుందని, రాని వారు అధైర్యపడవద్దని త్వరలో వారికి ఇస్తామన్నారు. చాలా మంది అర్హులైన లబ్ధిదారులకు సాంకేతిక సమస్యలు తలెత్తడంతో పింఛన్ అందడం లేదన్నారు. వాటిపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. అనంతరం నూతన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ వార చిట్టిబాబు, బూత్ కన్వీనర్ దారపురెడ్డి శ్రీనివాస్, ఆర్బీకే చైర్మన్ బొడ్డు అప్పాజీ, రంపం గోవింద్, కడలి కృష్ణ, దాసరి నాగబాబు, లూటుకుర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: అర్హత కలిగిన వారికి ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేస్తోందని మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. లూటుకుర్రు గ్రామంలో నూతనంగా మంజూరైన పింఛన్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తాతకాపు, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అడబాల చక్రపాణి, బర్రే చిట్టిబాబు, పంచాయతీ కార్యదర్శి సురేష్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



చిరతపూడిలో నూతనంగా మంజూరైన పింఛన్‌ను లబ్ధిదారునికి అందిస్తున్న సర్పంచ్, వైస్ ఎంపీపీ

ప్రజాహిత పాలనతో ముందడుగు

- ఎమ్మెల్యే రాపాక
- బి.సావరంలో గడప గడపకూ..

రాజోలు: సీఎం జగన్ నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజాహిత పాలనతో ముందడుగు వేస్తున్నామని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. బుధవారం బి.సావరం గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రాపాక నిర్వహించారు. బి.సావరం సిద్ధార్థ నగర్, శోభనా స్కూల్ పరిసర ప్రాంతాల్లో ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందించిన సంక్షేమ, అభివృద్ధి పనులను వివరించారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసి అర్హులకు నేరుగా బ్యాంకు ఖాతాలోకి నగదును జమ చేస్తున్నారన్నారు. ఎలాంటి వివక్షకు తావు లేకుండా పథకాలు అందిస్తున్నారన్నారు. ముఖ్యంగా పరిపాలనలో సమూలంగా మార్పులు తీసుకుని వచ్చి గ్రామ స్థాయిలోనే అన్ని సమస్యలు పరిష్కరించుకునేందుకు గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకుని వచ్చారన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను అభివృద్ధి చేశారన్నారు. నాడు–నేడు పనులతో గ్రామాల్లో ఉన్న పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలు మాదిరి తయారు చేశారన్నారు. గ్రామంలో నూతనంగా మంజూరైన పలువురికి పింఛన్లు ఎమ్మెల్యే రాపాక అందజేశారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, జెడ్పీటీసీ మట్టా శైలజ, సర్పంచ్ కడియం రమాదేవి, నాయకులు కంచి వెంకటరమణ, కుంపట్ల చిన్నారి, తిక్కిశెట్టి శ్రీనివాస్, నల్లి ప్రియాంక, బయ్యా రాజు, కడలి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సావరంలో కొత్త పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

ఒంటెలపై అమారీల ఊరేగింపు

మామిడికుదురు: ముస్లింల ఆరాధ్యదైవం హజరత్ ఇమామ్ హుస్సేన్, అతని పరివారం (అమరత్వం పొందిన 40వ రోజు) అర్బయీన్ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ఒంటెలపై అమారీలను ఊరేగించారు. దీనిలో భాగంగా స్థానిక ఇమామ్ రజా పంజా నుంచి నగరం మంజిలే కర్బలా వరకు అమారీలను ఊరేగించారు. మర్షియా ఆలపించారు. హజరత్ ఇమామ్ హుస్సేన్ కుటుంబ సభ్యులను బందీఖానా నుంచి విముక్తులను చేసిన ఘట్టాలను ముస్లింలు స్మరించుకున్నారు. ఇమామ్ హుస్సేన్ కుటుంబ సభ్యులను ఈజిప్టులోని షామ్ పట్టణం నుంచి వారి స్వస్థలం మదీనాకు ఒంటెలపై తీసుకు వస్తారు. ఈ సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ ఒంటెలపై అమారీలను ఊరేగించారు. ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చిన మత ప్రబోధకుడు అహ్మద్ మాసుమ్ అస్కరీ మషద్దీ మజ్లిస్ ఆలపించారు. మామిడికుదురులోని హజరత్ అబ్బాస్ పంజాలో మజ్లిస్ జరిగింది. దీంతో పాటు హజరత్ ఇమామ్ హుస్సేన్ పంజాలో కూడా మజ్లిస్ జరిగింది. ఈ పంజా నుంచి గుమ్మటాన్ని తీసి ఊరేగించారు. గురుహే తాజ్‌దారే పురాత్ భక్త బృందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. పలు భక్త బృందాలు భక్తులకు ప్రసాదాలు వితరణ చేశాయి.



అర్బయీన్‌లో భాగంగా ఒంటెలపై అమారీల ఊరేగింపు

11 నుంచి పాఠశాలల క్రీడలు

కొత్తపేట: మండల, నియోజకవర్గ స్థాయిలో స్కూల్ గేమ్స్ పోటీలు సమర్థవంతంగా నిర్వహించాలని ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ పీడీ, పీఈటీలకు సూచించారు. ఈ నెల 11 నుంచి నిర్వహించే స్కూల్ గేమ్స్‌పై బుధవారం స్థానిక మండల వనరుల కార్యాలయంలో స్కూల్ గేమ్స్ నిర్వహణపై ఎంఈఓ హరిప్రసాద్ పీడీ, పీఈటీలతో సమీక్షించారు. స్కూల్ గేమ్స్ వివరాలను ఎంఈఓ హరిప్రసాద్, ఎంఎస్‌డీఓ వైఎస్ఎస్ ఉషారాణి విలేకరులకు వివరించారు. ఈ నెల 11, 12 తేదీల్లో మండల స్థాయి పోటీలు, 14, 15, 16 తేదీల్లో నియోజకవర్గ స్థాయి పోటీలు జరుగుతాయన్నారు. ఈ గేమ్స్‌లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, త్రోబాల్, యోగా, అథ్లెటిక్స్ విభాగాల్లో టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ జరుగుతాయన్నారు. పీడీ, పీఈటీలు వారి వారి టీమ్‌లను తీసుకురావాలని సూచించారు. అండర్–11 బాలబాలికలు 2013 జనవరి 1 తరువాత, అండర్–14 బాలబాలికలు 2010 జనవరి 1 తరువాత, అండర్–17 బాలబాలికలు 2007 జనవరి 1 తరువాత పుట్టిన వారు మాత్రమే అర్హులని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఉన్నత పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న వారై ఉండాలని తెలిపారు. సమావేశంలో పీడీ, పీఈటీలు ఏఎస్ఎస్ రమాదేవి, ఎస్.వెంకటరావు, ఎ.అనిత, బి.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గోకులకృష్ణా.. గోపాలకృష్ణా..



రావులపాలెంలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



అప్పనపల్లిలో నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో బాలలు



కొత్తపేట సత్యసాయి మందిరంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న సమితి సభ్యులు



విశేషాలంకరణలో స్వామివారు

అంబాజీపేట: శ్రీకృష్ణాష్టమి వేడుకలను పుల్లేటికుర్రు శివారు చినలంక, వాకలగరువు, మొసలపల్లి గ్రామాల్లో బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. శ్రీకృష్ణుడి ఆలయం వద్ద గ్రామస్తులు పాల్గొని ప్రత్యేక పూజలతో పాటు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్ర సమయంలో కృష్ణుని ఉట్టికొట్టే కార్యక్రమాన్ని యువకులు కోలాహాలాల మధ్య ఘనంగా నిర్వహించారు. మాచవరంలో కందుల మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న గోశాలలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. అనంతరం ఉట్టి కొట్టారు.

రావులపాలెం: స్థానిక యాదవ సంఘం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అక్కడకు విచ్చేసిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి సంఘ ప్రెసిడెంట్ కానుమోను ధనరాజు, సభ్యులు కానుమోను సత్తిబాబు, నాగేశ్వరరావు తదితరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రారంభించారు. బాలికలు ప్రదర్శించిన కోలాట ప్రదర్శనను ఆయన తిలకించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, వార్డు సభ్యులు వెలగల సత్యనారాయణరెడ్డి, వరగోగుల సత్యవేణి, రెడ్డి సంఘం అధ్యక్షుడు పడాల పరమేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజోలు: కృష్ణాష్టమి వేడుకలు మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. రాజోలులోని పలు ప్రైవేటు పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. శ్రీకృష్ణుడి విగ్రహాలు ఏర్పాటు చేసి దీపాలంకరణ, భజనలు చేశారు. రాజోలు కొత్త వెంకటేశ్వరస్వామి వీధికి చెందిన చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు. తమ పిల్లలను శ్రీకృష్ణుడి వేషధారణలో ముస్తాబు చేసి తల్లిదండ్రులు పాఠశాలలకు తీసుకుని వెళ్లి వేడుకల్లో పాల్గొన్నారు.

ఆత్రేయపురం: మండలంలోని వాడవాడలా కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేకువజామునే గోమాతకు పూజలు నిర్వహించి ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడి వేషధారణతో అలరించారు. ఆత్రేయపురం వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు అంబరాన్నంటాయి. కృష్ణుడు వేషధారణ చేసి ఉట్టికొట్టి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అలాగే చిన్నారులు కృష్ణుని వేషధారణతో నిర్వహించిన పాత్ర ఎంతగానో ఆకట్టుకుంది.

కొత్తపేట: కృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా స్థానిక సత్యసాయి సేవా మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు, గర్భిణులకు సామూహిక సీమంతాలు, వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్, స్థానిక సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కంకటాల సత్యనారాయణ, అధ్యక్షుడు సుతాపల్లి లక్ష్మీనారాయణరావు, సమితి సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకూ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ ప్రసూతి వైద్య నిపుణురాలు వి.ప్రదీప్తికరుణ, జిల్లా సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు అడబాల కొండబాబు ముఖ్య అతిథులుగా పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలు ప్రారంభించారు. డాక్టర్ సుమారు 100 మంది గర్భిణులకు పసుపు, కుంకుమ, గాజులు, చీరలు, పళ్లెం, స్వీటు బాక్సులు ఇచ్చి సీమంతాలు చేశారు. బాలలకు శ్రీకృష్ణ, గోపిక వేషధారణ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం స్వామికి 108 రకాల ప్రసాదాలు నివేదన చేశారు. స్వామికి మహా హారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ జరిపారు. కార్యక్రమంలో సబ్‌జోన్ కన్వీనర్ గుర్రం చంటి, సభ్యుడు కొమ్ముల సాయి, స్థానిక సమితి సభ్యులు మారిశెట్టి సత్యనారాయణ, సత్యవరపు భాస్కరరామారావు, చింతం రామకృష్ణ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్థానిక ప్రియదర్శినీ బాలవిహార్‌లో కృష్ణాష్టమిని నిర్వహించారు.

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. వేకువజాము నుంచే కృష్ణాలయాలకు భక్తుల తాకిడి అధికమైంది. సంధిపూడిలో వేంచేసిన శ్రీకృష్ణుని ఆలయంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే ఆయా గ్రామాల ముఖ్య కూడళ్లలో ఏర్పాటు చేసిన ఉట్టికొట్టు కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో కొలువైన శ్రీ, భూ సమేత కేశవ స్వామివారి ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు బుధవారం ఘనంగా జరిపారు. ఆలయ ఆలయ అర్చకులు పెద్దింటి రాధాకృష్ణ సత్యగణేష్ ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మలికిపురం: మండలంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. గొల్లపాలెం, ఇరుసుమండ, లక్కవరం, చింతలమోరి, గూడపల్లి, మలికిపురం, గుడిమెళ్లంక తదితర గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి నిర్వహించారు. రాత్రి ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.

మామిడికుదురు: శ్రీకృష్ణాష్టమి వేడుకలను అప్పనపల్లిలో వైభవంగా నిర్వహించారు. పాత గుడి వద్ద రేస్ చిల్డ్రన్స్ బ్యాచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు ఆద్యంతం కనుల పండువలా జరిగాయి. గోపికలు, శ్రీకృష్ణుడు వేషధారణలతో చిన్నారులు అలరించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఏర్పాటు చేసిన ప్రత్యేక బొమ్మల నడుమ శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 40 రకాల పిండి వంటలను స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు. ఉట్టికొట్టే కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముందుగా గోపికలు, శ్రీకృష్ణుడు వేషధారణలతో చిన్నారులు మంగళవాయిద్యాలు, బాణాసంచా కాల్పుల నడుమ గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

చిన్నారులకు టీకాలు తప్పనిసరి

ఆలమూరు: చిన్నారులకు నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.మల్లికార్జున, పి.భవానీశంకర్ అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలను అందజేశారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు, ఎం.శ్రీనివాసు, ఎస్.వెంకటేశ్వరరావు, పి.ఉమ, సీహెచ్ బేబి తదితరులు వైద్య సేవలను పర్యవేక్షించారు. పినపళ్ల, చింతలూరు, పెనికేరు, చొప్పెల్ల, చెముడులంక, మడికి, గుమ్మిలేరు, నర్సిపూడి గ్రామాల్లో చిన్నారులకు టీకాలు, బాలింతలకు, గర్భిణులకు ఇంజక్షన్లను అందజేశారు.

సబ్‌కలెక్టర్ ప్రత్యేక పూజలు

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో స్వామిని రాజమహేంద్రవరం సబ్‌కలెక్టర్ ఎ.చైత్రవర్షిణి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు ఆమెకు స్వామి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని సర్పంచ్ కోట బేబీరాణి, వైస్ ఎంపీపీ నేతల నాగరాజులు అన్నారు. చిరతపూడి మెయిన్ విలేజ్, ఎస్టీ ఇళ్ల వద్ద డ్రైనేజీ నిర్మాణ పనులను బుధవారం సర్పంచ్ బేబీరాణి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పంచాయతీ నిధులు రూ.4 లక్షలతో పక్కా డ్రైనేజీని నిర్మిస్తున్నామన్నారు. అపరిష్కృతంగా ఉన్న డ్రైనేజీ సమస్య తీర్చేందుకు అధిక ప్రాధాన్యం ఇచ్చామన్నారు. మిగిలిన ప్రాంతాల్లో డ్రైన్‌లు, రోడ్ల నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చింతపల్లి వెంకట లక్ష్మి, వార్డు మెంబర్ దాసరి వీరబాబు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గుత్తుల వెంకటేశ్వరరావు, వార చిట్టిబాబు, నక్కా చిట్టిబాబు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్‌మన్‌ను నియమించండి

అంబాజీపేట: గ్రామంలో విద్యుత్ సమస్యలను తొలగించేందుకు విద్యుత్ లైన్‌మన్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఇసుకపూడి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు నెలల క్రితం ఇక్కడ విధులు నిర్వహించే లైన్‌మన్ బదిలీపై వేరే ప్రాంతానికి తరలి వెళ్లిపోయాడన్నారు. అప్పటి నుంచి విద్యుత్ జూనియర్ లైన్‌మన్, లైన్‌మెన్లలో ఎవ్వరినీ విద్యుత్ శాఖ అధికారులు నియమించలేదన్నారు. రాత్రి సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే ఉదయం వరకు కరెంట్ ఉండటం లేదని, ట్రాన్స్‌ఫార్మర్‌పై ఫీజులు కట్‌అయినా వేసే నాథుడు లేకపోవడంతో చీకటిలోనే ఉండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి లైన్‌మన్‌ను నియమించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మణిపూర్‌లో హింస ఆపాలంటూ శాంతి ర్యాలీ

పి.గన్నవరం: మణిపూర్‌లో జరుగుతున్న హింస, అరాచకాలను ఆపాలని జెడ్పీ మాజీ ప్రతిపక్ష నేత సాకా ప్రసన్నకుమార్ అన్నారు. మమత స్వచ్ఛంద సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కోరుకొండ జాన్ ఆధ్వర్యంలో పి.గన్నవరంలో బుధవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. మణిపూర్ వెళ్లి అక్కడ బాధితులను పరామర్శించి వైద్య సేవలు అందించిన క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ గుడివాడ పాల్ ప్రసాద్, పాస్టర్ ప్రదీప్‌లను ఈ సందర్భంగా దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ అంబటి భూలక్ష్మి, సర్పంచ్ బొండాడ నాగమణి, నాయకులు నల్లా పెదకాపు, కత్రి బాబూరావు, అంబటి మణికంత, రవితేజ, పి.స్వర్ణలత, వై.వేణుబాబు, జ్యోతిబాబు పాల్గొన్నారు.